రేషన్ బియ్యం స్కాం కేసులో డిటి అరెస్టు

మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

మదనపల్లె అర్బన్: తంబళ్లపల్లి బియ్యం గోడౌన్‌లో రూ.4.60 కోట్ల బియ్యం స్కాంకు పాల్పడిన కేసులో పౌర సరఫరాల బియ్యం గోడౌన్ డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లి ప్రభుత్వ బియ్యం గోడౌన్ డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, ఇన్‌ఛార్జి డిటిఒ సదాశివ కంది పప్పు, చక్కర, పామాయిల్ వంటి సరుకులను రేషన్ షాపులకు పంపకుండా అమ్ముకున్నారని పేర్కొన్నారు. సులువుగా డబ్బులు సంపా దించుకోవాలనుకుని గత ఏడాది ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు సరుకులు గోడౌన్‌కు రాకుండా బయట వ్యాపారులకు తరలించారని తెలిపారు. సరుకులు రేషన్ పాపులకు పంపినట్టుగా తప్పుడు రిపోర్టులు చేశారని తెలిపారు. జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో హరిప్రసాద్‌ను అరెస్టు చేశామన్నారు. సమావేశంలో ములకలచెరువు సిఐ షాదిక్ ఆలీ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఉల్లంఘనలు

ఆఫ్తాల్మిక్‌లో 23 మంది బదిలీలకు నో

రెండేళ్లు నిండని వారికీ మ్యూచ్యువల్

స్పెషల్ చీఫ్ సెక్రటరీ పేరుతో మంత్రాంగం

వైద్య ఆరోగ్య శాఖ బదిలీ నిబంధనల ఉల్లంఘనలపై విమర్శల వర్షం కురుస్తోంది. ఈ నెల 20, 21, 22వ తేదీల్లో కడప నగరంలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో జోన్-4 పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లాలకు చెందిన ఉద్యోగులకు బదిలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇష్టానుసారంగా బదిలీలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ఆఫ్తాల్మిక్ ఆఫీసర్స్ కేటగిరీ బదిలీలను ఇష్టానుసారంగా చేయడం చర్చనీయాంశంగా మారింది.



OFFICE OF THE DIRECTOR OF PUBLIC HEALTH & FAMILY WELFARE: A.P.
GOLLAPUDI: VIJAYAWADA

Rc.No.10599/E4.B/2023 Dated:22-06-2023

Sub:-Estt – Sri.P.Obulesu, Paramedical Ophthalmic Officer, PHC, Madhavaram, YSR Kadapa Dist, and Sri.K.Lakshmikara Reddy, Paramedical Ophthalmic Officer, PHC, Thambillavaripalli, Annamayya Dist– Request for mutual transfer vice-versa – Certain instructions –Issued- Reg.

Ref:-1.Application dt.Nil of Sri.P.Obulesu, Paramedical Ophthalmic Officer, PHC, Madhavaram, YSR Kadapa Dist.
2. Application dt.Nil of Sri.K.Lakshmikara Reddy, Paramedical Ophthalmic Officer, PHC, Thambillavaripalli, Annamayya Dist..

***

The applications of Sri.P.Obulesu, Paramedical Ophthalmic Officer, PHC, Madhavaram, YSR Kadapa Dist, and Sri.K.Lakshmikara Reddy, Paramedical Ophthalmic Officer, PHC, Thambillavaripalli, Annamayya Dist, are herewith enclosed in which they have submitted their mutual transfer applications on family & Health problems to consider their mutual transfers. As per the oral instructions of the Special Chief Secretary to the government for HM&FW dept., mutual transfers of Paramedical cadre can be allowed.

Hence, the Regional Director of Medical & Health Services, Kadapa who is the competent/appointing authority, is requested to consider the request and issue necessary mutual transfer orders to Sri.P.Obulesu, Paramedical Ophthalmic Officer, PHC, Madhavaram, YSR Kadapa Dist, and Sri.K.Lakshmikara Reddy, Paramedical Ophthalmic Officer, PHC, Thambillavaripalli, Annamayya Dist. on mutual basis.

Sd/-Dr.V.Rami Reddy,
Director of Public Health & Family Welfare.

//t.c.f.b.o//
Superintendent.

To
The Regional Director of Medical & Health Services, Kadapa.
Copy to the S.F.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైద్య ఆరోగ్య శాఖ జోన్-4లోని 23 విభాగాల పరిధిలో సుమారు ఎనిమిది వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ నెల 20, 21, 22వ తేదీల్లో కడప రీజినల్ డైరెక్టర్ ప్రాంతీయ కార్యాలయంలో నాలుగు ఉమ్మడి కడప జిల్లాలకు చెందిన ఉద్యోగులకు బదిలీలు చేపట్టిన సంగతి తెలిసిందే. 700 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకు న్నారు. వీరిలో 30 శాతం నిబంధన కింద రెండేళ్ల రిక్వెస్ట్, ఐదేళ్ల కాల పరిమితి కలిగిన ఉద్యోగుల పారామీటర్ల కింద 525 మంది బదిలీలకు అర్హులై నట్లు సమాచారం. పాత ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలోని ఆఫ్తాల్మిక్ ఆఫీసర్లకు ఈనెల 21న కౌన్సెలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఐదేళ్లు ఒకేచోట సర్వీస్ పూర్తి చేసిన ఆఫ్తాల్మిక్ ఆఫీసర్స్ 38 మంది బదిలీ కావాల్సి ఉండగా 15 మందిని మాత్రమే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కొంత మందిని యూనియన్ బేరర్‌లుగా రిటెన్షన్ చేయడం, మరికొందరిని కారణం చూపకుండానే రిటెన్షన్ చేసినట్లు సమాచారం. ఉద్యోగుల బదిలీ నిబంధనల ప్రకారం ఐదేళ్లు లాంగ్ స్టాండింగ్, రిక్వెస్ట్ బదిలీకి రెండేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులు అర్హులని తెలుస్తోంది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఉన్నతాధికారి బదిలీ నిబంధనల్ని ఉల్లంఘించి రెండేళ్లు పూర్తి చేయని ఇద్దరు పారా మెడికల్ ఆఫ్తాల్మిక్ ఆఫీసర్లను మ్యూచ్యువల్ బేసిస్ కింద బదిలీ చేయాలని ఆదేశించడం గమనార్హం. రీజినల్ డైరెక్టర్ కడప జిల్లాలోని మాధ వరం పిహెచ్‌సి ఆఫ్తాల్మిక్ ఆఫీసర్‌ను అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలోని తంబిళ్లవారిపల్లికు, ఇక్కడ పనిచేస్తున్న ఆఫ్తాల్మిక్ ఆఫీసర్‌ను మాధవరం పిహెచ్‌సికి బదిలీ చేసినట్లు సమాచారం. వీరిద్దరి పేర్లు 15 మంది బదిలీ జాబితాలో కూడా లేకపోవడం గమనించాల్సిన అంశం. 2023 మే నెలా ఖరుతో మ్యూ చ్యువల్స్ బదిలీ జాబితాల జాబితాలో కూడా ఆఫ్తాల్మిక్ కేడర్ లేకపోవడం గమనార్హం. స్పెషల్ చీఫ్ సెక్రటరీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యా మిలీ వెల్ఫేర్ మౌఖిక ఆదేశాల పేరుతో బదిలీ చేయడం ఉద్యోగ సంఘాల్లో చర్చ నడుస్తోంది. మ్యూచ్యువల్ బదిలీలు ముగిసినప్పటికీ సదరు ఆప్తా ల్మిక్ ఆఫీసర్స్ కోసం తెరుచుకోవడంలో మతలబేమిటనే అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై సదరు రీజనల్ డైరెక్టర్‌ను ఫోన్‌లో పలు మార్లు సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

విద్యకు పేదరికం అడ్డు కారాదు : జెసి

చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

మనిషి తలరాతను మార్చడానికి ఒక చదువుకు మాత్రమే సాధ్యమవుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సభాభావన్‌లో "జగనన్న అమ్మఒడి" పథకం 4వ విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం ఎప్పుడూ ఆటంకం కాకూడదన్న గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమ్మఒడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వరుసగా నాలుగో ఏడాది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున 1,52,366 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.225.55 కోట్ల రూపాయల మొత్తాన్ని నేరుగా జమ చేశారన్నారు. చదువు ఉంటే ఎక్కడైనా రాణించగలరని తల్లిదండ్రులు అందరూ కూడా తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాల మౌలిక వసతులతో కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. విదేశీ విద్య కార్యక్రమం ద్వారా ఇతర దేశాలకు వెళ్లి చదువుకోవడానికి కూడా ప్రభుత్వం సహకరిస్తుందని తల్లిదండ్రులందరూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ రోజుల్లో కార్పొరేట్ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం చదివించాలంటే ఎక్కువ డబ్బులు ఖర్చవుతాయని వీటన్నింటి దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇంగ్లీషులో చాలా చక్కగా మాట్లాడుతున్నారు. ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద ఎత్తున విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదని, విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి దీవెన, వంటి అనేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇలాంటి మంచి పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున 1,52,366 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.228,54,90,000 మొత్తాన్నికి సంబంధించి మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు ముఖ్య అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, డిఇఒ పురుషోత్తం, డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

కనులపండువగా ధ్వజారోహణం

ప్రారంభమైన సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలు

ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రజాశక్తి-నందలూరు

అన్నమయ్య జిల్లా నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధ వారం ఉదయం 9 నుండి 10 గంటల మధ్య సింహ లగ్నంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం ఆస్థానం ఘనంగా జరిగింది. శ్రీ సౌమ్యనాథస్వామి, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. ఈ ఊరేగింపు ద్వారా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ముందుగా పర్యవేక్షిస్తారని ప్రతీతి. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ధ్వజారోహణం బ్రహోత్సవాలకు సూచిక. సకల దేవతలకు ఆహ్వానం పలికే ధ్వజారోహణంలో మహావిష్ణువుకు గరుత్మంతుడు ప్రియ వాహనం. కావున ఆ గరుడ నిలువెత్తు రూపం 20 మీటర్ల నూతన వస్త్రంపై పసుపు, కుంకుమ, తైలంతో చిత్రీకరించారు. దీనినే ధ్వజ పటం అంటారు. ఈ నూతన వస్త్రం ధ్వజస్తంభంపై ఎగరవేస్తే సకల దేవతలు బ్రహ్మోత్సవాలను తిలకిస్తారని ప్రతీతి. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు మధ్య గరుడ ధ్వజపీఠాన్న ధ్వజస్తంబాగ్రహంనకు లాగారు దీంతో ధ్వజారోహణం పూర్తయింది. రాత్రి యాలి వాహనంపై మహా తేజోవంతుడైన శ్రీ సౌమ్యనాధుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేషాలంకరణలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తజన కోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో టిటిడి జెఇఒ సదా భార్గవి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్, ఆలయ మాజీ అధ్యక్షులు అరిగెల సౌమిత్రి, సోమిశెట్టి ప్రభాకర్, అరిగె నాని, కాకి చంద్ర, పెనుబాల నాగసుబ్బయ్య పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు గురువారం ఉదయం పల్లకిసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం. రాత్రికి హంస వాహనంపై శ్రీ సౌమ్యనాథ స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు డెప్యూటీ ఇఒ నటేష్ బాబు తెలిపారు.

రూ.50 లక్షలతో వసతులు : జెఇఒ

బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని జెఇఒ సదా భార్గవి చెప్పారు. మూలవిరాట్‌తోపాటు వాహనసేవలను భక్తులు సంతృప్తిగా దర్శించుకునేందుకు వీలుగా విస్తృతంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు రూ.50 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. త్వరలో ఆర్కియాలజి డిపార్టుమెంటు అనుమతులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నిరంతరాయంగా ఇసుక సరఫరా : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ప్రాధాన్యతా పనులకు ఇసుకను నిరంతరాయంగా సరఫరా చేసేలా చూడాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో అధికారులకు సూచించారు. బుధవారం మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో ఇసుక లభ్యతా సరఫరా గురించి జాయింట్ కలెక్టర్ అధికారులతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించి ఎప్పటికప్పుడు వచ్చిన ఇండెంట్ల ప్రకారం ఇసుక సరఫరా చేయాలని, సమీపంలోని ఇసుక రీచ్‌ల నుంచి సరఫరా అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. కొత్తగా గుర్తించిన పలు ఇసుక రీచ్‌లు, జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్‌ల స్థితిగతులు, క్లియరెన్స్ గడువు ముగిసిన ఇసుక రీచ్‌లు మొదలైన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మైన్స్ అధికారి రవి ప్రసాద్, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్న కుమార్, ఇరిగేషన్ ఎస్ఇ కృష్ణమూర్తి, డిపిఒ ధనలక్ష్మి, గ్రౌండ్ వాటర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

'పద్మా' అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి

యువజన సర్వీసుల శాఖ, విజయవాడ వారి ఉత్తర్వుల మేరకు, 2024 పద్మ అవార్డులు, పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ కోసం "సామాజిక సేవా" రంగంలో అర్హులైన వారు ఆన్‌లైన్లఓ https://awards.gov.in ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సిఇఒ సి.సాయిగ్రేస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాపీలతో సహా ఫోటోలు, పత్రికా ప్రకటనలు జత పరచి స్టెప్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. లేదా పోస్టు ద్వారా అయినా పంపాలన్నారు. ఇతర వివరాలకు స్టెప్, మేనేజర్ వి.వి.సుబ్బరాయుడు 9949298810లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మెరుగైన పిఆర్‌సిని ప్రకటించాలి

- ఎపిఎస్‌పిడిసిఎల్ డిస్కం అధ్యక్షులు వి.దేవేంద్రారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 (ఎపిఇఇయు) మదనపల్లి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా బి.శంకర్‌రెడ్డి, ఎస్.జాఫర్ వలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మదనపల్లి పట్టణం, రామారావు కాలనీలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపిఎస్‌పిడిసిఎల్ డిస్కం అధ్యక్షులు వి.దేవేంద్రారెడ్డి, తిరుపతి సర్కిల్ అధ్యక్షులు ఎం.పాండురంగయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు వి.గోపి, తిరుపతి సర్కిల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిస్కం అధ్యక్షులు దేవేంద్రారెడ్డి మాట్లాడుతూ 24 గంటలు శ్రమించే కార్మికులకు మెరుగైన పిఆర్సిని అందించాలని వారి సంక్షేమానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జరిగిన ఎన్నికలలో కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 డివిజన్ కార్యదర్శిగా ఎస్.జాఫర్ వలి, అధ్యక్షులుగా బి.శంకర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రీజినల్ నాయకులు ఆర్.గణేష్ బాబు, బి.రవీంద్ర, బ్రహ్మానందయ్య, మదనపల్లి డివిజన్ విద్యుత్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న దేవేంద్రారెడ్డి

గొప్ప పరిపాలనాదక్షుడు పి.వి.నరసింహారావు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అద్భుత పాలనతో భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప నాయకుడు స్వర్గీయ మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు అని మదనపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.రెడ్డి సాహెబ్ అన్నారు. బుధవారం భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఆయనకు ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశానికి అందించిన గొప్ప ఆర్థికవేత్త పి.వి నరసింహారావు అని, భారతదేశ తొమ్మిదవ ప్రధానమంత్రిగా 1991 నుంచి 1996 దాకా పనిచేశారన్నారు. ఈయన బహుభాషాకోవిధుడు, రచయితగా ప్రసిద్ధిగాంచారన్నారు. ఈ పదవిని అధిష్టించిన మొదటి దక్షిణ భారతదేశ వ్యక్తిగా, ప్రధానిగా పని చేసిన ఏకైక తెలుగువాడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి,కుంటుపడుతున్న వ్యవస్థను తిరిగి గాడిలోపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అదే సమయంలో దేశభద్రతకు సంబంధించిన బాబ్రీ మసీదు కూల్చివేత లాంటి కొన్ని సంఘటనలకు కూడా ఆయన సాక్షిగా ఉన్నాడని, 1957లో శాసన సభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పి.వి రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగానే కాకుండా కేంద్ర రాజకీయాలలో కూడా ప్రవేశించి ప్రధానమంత్రి పదవిని చేపట్టాడని, కాంగ్రెస్ నేతృత్వంలో తగిన సంఖ్యాబలం లేని సమయంలో మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం పాటు నడిపించడం ఆయన రాజకీయ చాతుర్యానికి నిదర్శనమన్నారు. దేశ పురోభివృద్ధికి ఎంతో కృషి చేసే పి.వి.నరసింహారావు లాంటి గొప్ప నాయకులను దేశానికి అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని కొనియాడారు.

జిల్లా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి జిల్లా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తామని ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మదనపల్లి జిల్లా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. విజయవాడ నుంచి మదనపల్లికి వచ్చిన ఆయన మొదట ఆరోగ్యవరం మెడికల్ కాలేజీ, జిల్లా ప్రభుత్వ అసుపత్రి భవన నిర్మాణాలను పరిశీలించారు. అస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. ప్రస్తుత 150 పడకల అస్పత్రిని మరో 200 పడకలుగా పెంచి, మొత్తం 350 పడకల మెటర్నిటీ అసుపత్రిని చేస్తామని తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే నవాజ్ బాషాతో జిల్లా ఆసుపత్రి అభివృద్ధిపై చర్చించారు.

ఆస్పత్రిని పరిశీలిస్తున్న మురళీధర్‌రెడ్డి

టమోటా వాహనాన్ని ప్రారంభిస్తున్న త్యాగరాజు

రాయితీ ధరతో రైతు బజార్లకు టమోటా

- జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి త్యాగరాజు

ప్రజాశక్తి-రాయచోటి

రాయితీ ధరతో రైతు బజార్లకుమ టమోటాలను సరఫరా చేయనున్నట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి త్యాగరాజు అన్నారు. బుధవారం టమోటా ధరలపై ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలు పలుకుతున్న టమోటాలను ప్రజల సౌకర్యార్థం రైతు బజార్ల ద్వారా కిలో రూ.50 చొప్పున తక్కువ ధరకు విక్రయించడానికి రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం నుంచి రాయచోటిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాయితీపై బుధవారం కడప రైతు బజార్, కర్నూలు సి.క్యాంపు రైతు బజార్‌కు 10 టన్నులు టమోటలను సరఫరా చేశామని పేర్కొన్నారు.

అన్సారీని సత్కరిస్తున్న అబ్దుల్ కలీం

జిల్లా అదనపు కోర్టు పిపిగా రఫీ అన్సారీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షులైన ఎస్ఎండి రఫీ అన్సారీ 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్‌ఛార్జి పబ్లిక్ ప్రాసిక్యూటరుగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడ డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. న్యాయవాది రఫీ అన్సారీ ప్రస్తుతం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పిపిగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అదనపు జిల్లా జడ్జి కోర్టు పిపిగా నియమితులైన సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, పాత్రికేయులు పఠాన్ జాకీర్ హుస్సేన్ శాలువాతో సత్కరించారు. పలువురు సహ న్యాయవాదులు తదితరులు అన్సారీని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా స్థాయిలో ఆలిండియా ఆర్‌బిఐ క్విజ్ ప్రోగ్రాం నిర్వహించామని ఎల్‌డిఎం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటిగా నిలిచిన ఒక పాఠశాలకు సంబంధించిన ఇద్దరు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశామని పేర్కొన్నారు. రాయచోటిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో అన్నమయ్య జిల్లాకు సంబంధించిన 30 మండలాలలో మొదటిగా నిలిచిన ఒక్కొక్క పాఠశాల తరపున ఇద్దరు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారుని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులైన ఎన్.స్పందన, జి.జగన్నాథ్ మొదటి బహుమతి గెలుచుకున్నారున్నారు. ఈ విద్యార్థులు ఇద్దరూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలను విశాఖపట్టణంలో జూలై నెలలో నిర్వహించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించిందన్నారు. ఈ పోటీలో పాల్గొన్న అందరి విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో అందరి విద్యార్థులకు మెడల్స్, బాక్సులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఆలయానికి ముస్లిముల దాతృత్వం ఆదర్శనీయం

- ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల

మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మన సంస్కృతిక, సాంప్రదాయాలను మనమే కాపాడాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్త మంచూరులో టిటిడి నిధులతో చేపట్టనున్న ఆలయ జీర్ణోద్ధరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందిస్తున్నారని, ఇలాంటి నాయకులను ప్రజలు కాపాడుకుంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పీలేరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, బైపాస్ రోడ్ల నిర్మాణం, ఆసుపత్రులు, విద్యా సంస్థల అభివృద్ధి, సాగు, తాగునీటి వసతి తదితర తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. మంచూరు గ్రామంలో ఆలయ నిర్మాణానికి ముస్లింలు స్థలాలను దానం చేసి మతసామరస్యాన్ని చాటుకోవడం అభినందనీయమని, వాల్మీకిపురం మండలం తనకు సదుం మండలంతో సమానమన్నారు. ఈ రెండు మండలాలు తనకు తల్లి లాంటివని, ఈ మండలాల్లో తమ పార్టీకి వచ్చే మెజారిటీ విజయానికి పునాదులు వేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలు పీలేరు నియోజకవర్గ అభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్నారని, ఈ నియోజకవర్గాన్ని తమ సొంత నియోజకవర్గంగా భావించి సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. రాజధానులకు పరిమితం కాకుండా మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం పర్యటించి ప్రజలకు సేవలు అందిస్తూ ఎంపీ మిథున్ రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని, నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఆయనను ప్రజలు ఎప్పటికీ విస్మరించరాదన్నారు. తదనంతరం రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, ఆటుపోటులు ఎదుర్కొన్న తనలాంటి వారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తూ ఆదరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, జడ్పిటిసి నిర్మల, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, నాయకులు సహదేవ రెడ్డి, రమేష్, చింతల సాయిక్రిష్ణారెడ్డి, చింతల శివానందరెడ్డి, జింక వెంకట చలపతి, నీళ్ల భాస్కర్, శంకర్ రెడ్డి, బిడ్డల కేశవరెడ్డి, చిన్న, నాగరాజ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెస్ట్ బుక్కులు పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మధ్యాహ్న భోజనాన్ని యధావిధిగా కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను పూర్తి చేస్తూ, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, ప్రభుత్వ నిబంధనలకు పూర్తి వ్యతిరేకంగా ఒక విద్యార్థి దగ్గర నుంచి 40 నుండి 70 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని, విద్యాసంస్థల్లో నోటీస్ బోర్డ్ నందు ఫీజుల పట్టిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రోహిత్, లతీఫ్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.83 వేలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని తవళం గ్రామంలో ఉన్న శ్రీ నేలమల్లేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఉదయం దేవాదాయ శాఖ ధికారి రవి కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ ఇఒ మంజుల పర్యవేక్షణలో ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఆలయ హుండీని లెక్కించినట్లు తెలిపారు. నాలుగు నెలలకు హుండీ ద్వారా రూ.83,364లు ఆలయ ఆదాయానికి వచ్చిందని అన్నారు. ఈ మొత్తాన్ని ఇండియన్ బ్యాంక్ వాల్మీకిపురంలో జమచేయడమైనదని, ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. ఆలయం వద్ద పెంచిన ఆర్జిత సేవా టిక్కెట్ల ధరలు జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కార్యవర్గ సభ్యులు గోపాలకృష్ణ, రవీంద్ర, చిన్నరెడ్డప్ప, ఆలయ అర్చకులు శంకరయ్య దేవాదాయశాఖ సిబ్బంది మహేష్ పాల్గొన్నారు.

జులై 2న ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-గాలివీడు

జులై 2న కడప లైఫ్‌లైన్ ఆస్పత్రి, గాలివీడు అమీన్ మెడికల్ స్టోర్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు మెడికల్ స్టోర్ ప్రొప్రైటర్ అమీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరుగుతుందని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిపి, షుగర్, గ్యాస్ట్రిక్ ట్రబుల్, గుండె జబ్బులు, చెవు,ముక్కు, గొంతు, కంటి సమస్యలకు ఉచిత వైద్యం అందిస్తారని చెప్పారు. వైద్యులు జనరల్ మెడిసిన్ ఎండి షేక్ రబ్బానీ, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ షేక్ సోఫియా డాక్టర్ ఖమామ్, డాక్టర్ సాదిక్‌లు ఈ వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మంచినీటి మోటారుకు మరమ్మతులు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఇసుకపల్లి హరిజనవాడలో మంచినీటి మోటారుకు మరమ్మతు పనులను బుధవారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పరిశీలించారు. నాగిరెడ్డిపల్లి మెయిన్ రోడ్డు, హరిజనవాడ తదితర ప్రాంతాలకు నీటి సరఫరా చేసే మోటార్ కాలిపోయింది. వెంటనే పంచాయతీ సిబ్బంది మోటార్ మెకానిక్‌ను పిలిపించి కాలిపోయిన మోటర్‌ను తయారు చేయించి బుధవారం తిరిగి మోటర్‌ను సిద్ధం చేశారు. మోటర్ కాలిపోయిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా మరమ్మతులు చేసి తాగు నీటికి ఇబ్బంది కలుగకుండా చేశారని ప్రజలు సర్పంచ్‌ను అభినందించారు.

యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నియోజకవర్గంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా నివారించవచ్చునని ప్రముఖ పారిశ్రామికవేత్త కదిరినాయుని కోట జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మొరుసుకాపురెడ్డి (వక్కలిగర గౌడ) సమావేశం పాల్గొన్న ఆయన స్థానిక నియోజకవర్గంలోని మొరుసుకాపుల నాయకులతో కలసి విలేకరుతో మాట్లాడారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, ఇక్కడ ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యను తీర్చవచ్చని అన్నారు. ఇక్కడ సారవంతమైన భూములు ఉండడంతో పండ్లు, కూరగాయలు పంటలు ఎక్కువగా రైతులు పండిస్తారని దళారుల చేతిలో రైతులు మోసపోతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఈ దళారుల చేతిలో మోసపోకుండా కట్టడి చేయవచ్చునన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇక్కడ పరిశ్రమలు తీసుకొచ్చి ఇండస్ట్రియల్ కారిడార్‌లను ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. నియోజకవర్గంలో మొరుసు కాపురెడ్డి (వక్కలిగరుగౌడ) లుఎక్కువ జనాభా కలిగి ఉన్నారని వారంతా వ్యవ సాయంపైనే ఆధారపడి జీవి స్తున్నారని అన్నారు. మొరుసు కాపులకు బిసి-బి సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మొరుసుకు కాపు నాయకులు ఎం.ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఎల్ఐసి మద్ది రెడ్డి, చిన్న బాబురెడ్డి,లోకనాథరెడ్డి, మస్తాన్‌రెడ్డి, శివారెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏక్ భారత్ శిబిరంలో పాల్గొన్న చిట్వేలి విద్యార్థి

చిట్వేలి : ఎన్‌సిసి డైరెక్టరేట్ ఎపి, తెలంగాణ రాష్ట్రాల నుంచి గుంటూరు గ్రూపు ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ శిబిరంలో కడప 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో చిట్వేలి జడ్‌పి హైస్కూల్ ఎన్‌సిసి విద్యార్థి పసుపుల యజ్ఞధర్ పాల్గొన్నాడని ప్రధానోపాధ్యాయులు ఎబిఎన్ ప్రసాద్, ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 26 వరకు గుంటూరులో ఎన్‌సిసి జాతీయ స్థాయి రెండవ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఆజాద్, అమృత మహోత్సవ ఐక్యతగా జరిగిందని అన్నారు. ఇతర రాష్ట్రాల సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను గౌరవించడంతోపాటు ఎన్‌సిసి విద్యార్థులు జాతీయ సమైక్యత, పరస్పర సహకారం, సాంగత్యం, జట్టు స్ఫూర్తి, మతసామరస్యభావం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమగ్రత, శ్రమ గౌరవం వంటి వాటిని పెంపొందించడం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, దుర్గ రాజు, యుగంధర్, దొడ్డవారు శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట సుహాసిని, ప్రణవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలకు నిలువుటద్దం వైసిపి పాలన : 'నల్లారి'

ప్రజాశక్తి -కలకడ

అక్రమాలకు నిలువుటద్దంగా వైసిపి పాలన కొనసాగుతుందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రమైన కలకడలో [illegible] ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి పాలన భూకబ్జాలకు నిలయంగా మారిందని విమర్శించారు. వైసిపి నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో చెరువులు, కుంటలు, గుట్టలు సైతం వైసిపి నాయకులు కబ్జాలు చేస్తూ, తమ సొంతం చేసుకోవడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. [illegible] పరాకాష్టగా మారిందని ధ్వజమెత్తారు. పీలేరు పట్టణంలో సూనె శుద్ధి కర్మాగారం పరిసర ప్రాంతాలను కబ్జా చేసి భవనాలను అక్రమంగా నిర్మించి కోవడంపై తాను పోరాటం చేసి వాటిని కట్టడి చేసామన్నారు. కలకడలో మార్కెట్‌యార్డ్‌కు కేటాయించిన భూమిని చదును చేసుకుంటూ ప్లాట్లు వేసుకొని కబ్జాకి [illegible] వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది చోద్యం చూడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి చరమ గీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎ.జిలానిబాషా, బాజాహుస్సేన్, జిలాన్ అలీ, ఇద్రూస్ అలీ, నౌషాద్, జాఫర్ హుస్సేన్, కరీముల్లా, రవి, రెడ్డప్ప నాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పలాలను లబ్ధిదారులకు అందించడమే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సాయంత్రం రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట-2 గ్రామ సచివాలయ పరిధిలోని నారాయణరాజుపోడు, హరిజనవాడలో పర్యటించారు. జగనన్న ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజల నుంచి వస్తున్న విన్నతులను, సమస్యలను అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పరిష్కరించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను కొరముట్ల పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, చంద్రరాజు, పట్టణ కన్వీనరమేష్, ఎంపిటిసిలు జనార్ధన్ రాజు, మల్లికార్జున, గునిశెట్టిరమేష్, ఆదినారాయణ, అంజి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** రాష్ట్రంలోని నిరుపేదలకు వైయస్సార్‌సిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తూ అండగా నిలబడుతున్నాదని మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం రెడ్డివారిపల్లి పంచాయితీలోని రెడ్డివారిపల్లి, చీనేపల్లి, ఎద్దుల వారిపల్లి, చలిమామిడి హరిజనవాడ, జంగమోళ్లపల్లి, బాలేపల్లి, పూజారిఇండ్లులో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ, నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్

ప్రభుత్వ విప్ కొరముట్లకు స్వాగతం పలుకుతున్న వైసీపీ నాయకులు

రామమోహన్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్ ను లబ్ధిదారులకు అందించి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి నేరుగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుబ్రమణ్యం, చంద్రాయుడు, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, వైసిపి పార్టీ నాయకులు నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, చంద్ర మోహన్, యుగంధర్ రెడ్డి, నవీన్, హేమంత్, ఎంపిడిఒ శేషగిరిరావు, డిటి సిరాజుద్దీన్, ఎస్ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు మారప్ప, ఎర్రమల్లయ్యనాయుడు,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే ఎమ్మెల్యేపై విమర్శలు

- మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రజాక్షేత్రంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ము ధైర్యం లేకపోవడంతోనే టిడిపి నాయకులు పసలేని ఆరోపణలతో రోడ్డెక్కడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మున్సిపల్ చైర్మన్ ఎస్.ఫయాజ్ బాషా పేర్కొన్నారు. అసత్య ఆరోప ణలు, అసత్య పోస్టింగ్‌లు పెట్ట డంతో రాజకీ యంగా లబ్ధి చేకూరుతుందని ఆశించడం వారి విజ్ఞతకే వదిలే స్తున్నా మన్నారు. టిడిపి ప్రజాభిమానం పొందాలని ఎప్పుడూ ఆలోచన చేయడం లేదన్నారు. కేవలం రాజకీయ మనుగడ కోసం ఇష్టానుసారంగా బురదజల్లడం, సంబంధంలేని విషయాలపై ఆరోపణలు చేయడం నీచమైన చర్యని అన్నారు. ఉచిత బియ్యాన్ని అమ్ముకున్నారని ఆయన పై ఆరోపణలు చేయడం తగదని, కరోనా సమయంలో మూడు పూటల ఉచిత భోజనాలు ఏర్పాటు చేసిన విషయం అందరికి తెలుసని చెప్పారు. అసత్యపు ప్రచారాలు చేసే వారిపై పోలీసులకు పిర్యాదు చేస్తున్నామని, ఆరోపణలు రుజువు కాకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులును కోరారు. **రామాపురం :** రాజకీ యంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే టిడిపి దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని మండల వైసిపి నాయకులు ఆరోపించారు. టిడిపి సోషియల్ మీడియా సదస్సులు

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

పెట్టుకుని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిపై స్థానిక టిడిపి నేతలు దుర్బుద్ధితో దుష్ప్రచారానికి పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కె ట్‌కమిటీ చైర్మన్ కర్ణపువిశ్వనాథరెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, నాయకులు సూరం వెంకట సుబ్బారెడ్డి, అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డి, వైస్ ఎంపిపి రవిశంకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆదిరెడ్డి రెడ్డప్పరెడ్డి, వెంకటరమణ, రవిశంకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం

రాయచోటి టౌన్ : రేషన్ బియ్యం అవినీతి చేశాడని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని మదనపల్లి నియోజక వర్గ పరిశీలకుడు హబీబుల్లాఖాన్, జిల్లా మైనార్టీఅధ్యక్షుడు బెపారి మొహమ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం వేర్వేరు ప్రాంతాలలో వైసిపి, కౌన్సిలర్లు, నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటిడిపి ఫేస్ బుక్ సోషియల్ మాధ్యమాల్లో వచ్చిన శ్రీకాంత్‌రెడ్డి రూ.5 కోట్ల రేషన్ బియన్ని విక్రయించారని వచ్చిన ఆరోపణలు నిరాదరణమైనవని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫయాజూర్ రహ్మాన్, కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్, శ్యామ్, గౌస్ ఖాన్, హరున్ బాషా, అల్తాఫ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్ పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష' : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-కురబలకోట

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నామని సబ్ కలెక్టర్ మురళి అన్నారు. బుధవారం అంగల్లు సచివాలయంలో ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్లు, సచివాల ఉద్యోగులు ఏ విధంగా సర్వే చేస్తున్నారనే విషయంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంటి దగ్గర కనీసం 15 నిమిషాలు ఉండి వారికి ప్రభుత్వ కార్య క్రమాలపై పూర్తిగా అవగాహన కల్పించారు. వారికి కావలసిన ధృవపత్రాలు, లబ్ధి పొందని స్కీములు ఉంటే వెంటనే నమోదు చేయాలన్నారు. ఏటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఇళ్లను సర్వే చేయాలని ఆదేశించారు. పార్టీలకు అతీతంగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జగనన్న సురక్షలో కూడా ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిపి దస్తగిరి, తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, ఎంపిడిఒ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎంటిజి. ప్రసాద్, విఆర్ఒ, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** ప్రస్తుతం ప్రజలకు ఉన్న సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్ రెడ్డి తెలిపారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ మురళి

తవళం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, వైసిపి నాయకులు రవి లతో కలసి సచివాలయ సిబ్బందితో, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. జూలై 1 నుంచి 20 తేదీ వరకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రవి, గోపాలకృష్ణ, మండల వాలంటీర్ల కో-ఆర్డినేటర్ మౌలాలి, వాలంటీర్లు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ముస్లిం సోదరులు గురువారం బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని రూరల్ సిఐ పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ముందుగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా జరుపుకోవాలని ఈద్గా, దర్గాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ముస్లిం సోదరులు గోవధ నిషేధ చట్టాన్ని కూడా గౌరవించాలని కోరారు. పండుగను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకొని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. **రాజంపేట అర్బన్ :** త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ప్రముఖ విద్యావేత్త, టిడిపి నియోజకవర్గ సీనియర్ నేత చమర్తి జగన్ రాజు పేర్కొన్నారు.బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. **రాయచోటి టౌన్ :** మత సామరస్యానికి ప్రతీకగా అన్నమయ్య డిసిసి మైనార్టీ చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసాన్ని కలిగి, సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ చాటుతుందని చెప్పారు. ముస్లిం మైనార్టీలకు బక్రీద్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.**పీలేరు :** బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరుల ప్రత్యేక సామూహిక ప్రార్థన కోసం ఈద్గా మైదానం సిద్ధం చేయించినట్లు పీలేరు పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా తెలిపారు. ఈద్గా మైదానంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రార్థనల కోసం వచ్చే ముస్లిం సోదరులకు నీటి సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముతవల్లీలతో పాటు గ్రామ పెద్దలు, ఇఒ రెడ్డిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మఠం నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండలం కొత్తకోడూరులోని శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యులు మఠం నిర్మాణానికి ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. ముక్క రూపానంద రెడ్డి నియోజకవర్గంలోని పలు ఆలయాలకు ఆర్థిక సాయం చేశారని, నిరుపేదలకు విద్య కోసం, ఉన్నత చదువుల కోసం కూడా ఆయన ఎంతో ఆర్థిక సాయం చేసి దాతృత్వం చాటుకున్నారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మఠం నిర్వాహకులు సి.నరసింహాశర్మ, సి.సురేష్‌కుమార్, రామమోహన్‌శర్మ, ప్రవీణ్‌కుమార్ శర్మ, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి రైతు భూమిలో ఉన్న రసాయనాలు గుర్తించడానికి భూసార పరీక్ష తప్పనిసరిగా చేయించు జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. వెలుగల్లు గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో ఆదర్శ రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసే పంట వివరాల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మురళీధర్, ఎంపిటిసి ఎన్ఎస్.మహబూబ్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు హర్షణీయం

పజాశక్తి-గాలివీడు

మండలానికి జూనియర్ కళాశాల మంజూరు కావడం హర్షణీయమని వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలసి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలానికి జూనియర్ కళాశాల మంజూరు కావడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. కళాశాల మంజూరు చేయించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికి విద్యార్థులు,తల్లిదండ్రులు,మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నిర్మించిన అదనపు గదుల్లో 2023-24 ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపుల్లో విద్యార్థులకు అడ్మిషన్లు పొందవచ్చున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు ఆవుల నాగభూషన్ రెడ్డి, మండల మైనారిటీ నాయకులు ఎస్.ఖాదర్ మొహిద్దీన్, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌రెడ్డి, నూలివీడు సర్పంచ్ ఉమాపతిరెడ్డి, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీకాలతోనే వ్యాధి నిరోధక శక్తి

వీరబల్లి : పిల్లల్లో వ్యాధి నిరోధ శక్తి పెంపునకు టీకాలు ఎంతో దోహద పడతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. బుధవారం మండలంలోని గ్రంధివాండ్లపల్లెలో 104 ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రం, స్కూల్ విజిట్ చేస్తూ టీకాల ఆవశ్యకత గురించి తల్లులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. గర్భిణీలకు రెండు టిడి డోసు ఇంజక్షన్‌తో పాటు 150 ఐరన్ మాత్రలు ఇస్తామని చెప్పారు. వీరబల్లి వైద్యాధికారి వినయ్‌బాబు , హెచ్‌సిఒ బాలరామరాజు, ఎం ఎల్‌హెచ్‌పి స్వాతి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఎంపిహెచ్ఎ నాగయ్య, డిఇఒ మోహన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లను రద్దు చేయాలని వినతి

సుండుపల్లె : ఇసుక రీచ్ అనుమతిని రద్దు చేయాలని కోరుతూ మండలంలోని రాయవరం గ్రామపంచాయతీ ప్రజలు ఆకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్కడ ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడం వల్ల బహుదనది పక్కనే ఉన్న మా వ్యవసాయ భూములను నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గతంలో తహశీల్దార్ దృష్టికి కూడా మా సమస్యను తీసుకపోయామని తెలిపారు. వ్యవసాయమే జీవనాధారమైన మాకు ఇబ్బంది కలుగకుండా ఇసుకరీచ్‌ను రద్దు చేయాలని జెసిని కోరినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒశంకరయ్య

సమస్యల పరిష్కారమే ఎజెండా : ఎంపిపి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సమస్యల పరిష్కారమే ఎజెండాగా మండలం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు ఎంపిపి లక్ష్మీ నరసమ్మ పేర్కొన్నారు. బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశాన్ని ఎంపిడిఒ శంకరయ్య ప్రారంభించారు. సమావేశంలో ఎంపిపి, జడ్‌పిటిసి రామచంద్రయ్య యాదవ్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు అరుణ్‌కుమార్‌రెడ్డిలను సభా వేదికపై ఆహ్వానించారు. జడ్‌పిటిసి రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోనూ ఇంజనీర్ అసిస్టెంట్లు, వాలంటీర్ల పనితీరు సరిలేదని లేదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సెక్రటరీలు జాగ్రత్త తీసుకోవాలన్నారు. తహశీల్దార్ ధనుంజయులు ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా సకాలంలో పనులు చేస్తున్నారని అన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి వచ్చే అధికారులు నివేదిక సమర్పించాలని తెలిపారు. వెలుగు ఎపిఎం మాట్లాడుతూ గృహ నిర్మాణాలు నిర్మించుకున్న వారికి పునాదులు వేయడానికి మహిళ గ్రూపులో ఉన్న మహిళలకు సంఘమిత్ర ద్వారా రూ.35వేలు ఆర్థికసాయం వడ్డీకి ఇస్తామని తెలిపారు. విద్యుత్ శాఖ ఎఇ గిరిధర్ మాట్లా డుతూ మండలంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించేందుకు అనుమతులు వచ్చాయని తెలిపారు. సమావేశంలో ఉపాధి హామీ అధికారి మంజుల, ఎంఇఒలు రెడ్డి శేఖర్, భువనేశ్వరచారి, డి.టి. మొహమ్మద్‌అన్సారి, ఆర్ఐ బాలాజీ, మండలం ప్రత్యేక ఆహ్వానితుడు అరుణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి మస్తాన్, ఎంపిటిసిలు సుబ్బయ్యనాయుడు, రామసుబ్బారెడ్డి, సర్పంచులు వేమలేటి కోటి రవి, గుడిపల్లి సర్పంచ్ రఘు, బడికాయలపల్లి సర్పంచ్ ఆదెప్ప గౌడ్, ఎంపిడిఒ ఎఒ థామస్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డాక్టర్లు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారులు బుధవారం బాధ్యతలు చేప ట్టారు. నూతన మెడికల్ ఆఫీసర్-1గా డాక్టర్ బి.రమేష్ బాబు, మెడి కల్ ఆఫీసర్-2గా డాక్టర్ పి. దీక్షితరాణి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖబేగం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి (పిపిఐ విభాగం)కు బదిలీ కాగా వారి స్థానంలో తరిగొండ పిహెచ్‌సి లో పనిచేస్తున్న డాక్టర్ బి.రమేష్ బాబు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్ -2 డాక్టర్ అభిషేక్, నంద్యాల జిల్లా మద్దూరు పిహెచ్‌సికి బదిలీ కాగా వారి స్థానంలో విజయనగరం జిల్లా, తెర్లామ్ పిహెచ్‌సిలో పనిచేస్తున్న డాక్టర్ పి.దీక్షితరాణి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించటానికి కృషి చేస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది వారిని కలిసి అభినందనలు తెలిపారు.

డాక్టర్ బి.రమేష్ బాబు

డాక్టర్ పి.దీక్షిత రాణి

జిల్లా స్థాయి విజేతకు నగదు బహుమతి

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థికి నగదు బహుమతి ప్రదానం చేశారు. వివరాల్లోకి వెళితే ఆర్‌బిఐ ఆదేశాల మేరకు బుధవారం రాయచోటి డైట్ పాఠశాల లో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వీరబాలు, మధుసైలు అనే విద్యార్థులకు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. వీరికి ఆర్‌బిఐ రూ.75వేలు నగదు, మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఎ.కృష్ణ మూర్తి, సిబ్బంది అభినందించారు.

బిసి చైతన్య సభ పోస్టర్ ఆవిష్కరణ

పుల్లంపేట : నియోజవర్గ పరిధిలోని జ్యోతిరావుపూలే సర్కిల్ దగ్గర బిసి చైతన్య సమితి వ్యవస్థాపకులు బిసి.రమణ ఆధ్వర్యంలో బుధవారం బిసి చైతన్యసభ పోస్టర్లను ఆవిష్కరించారు. బిసిల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నాయకులు శాంతయ్య, నియోజకవర్గ సమన్వయకర్త గోసాలదేవి, సిగమాల రమేష్, తురక వెంకటసుబ్బయ్య, చైతన్య సభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, చల్లా జయకర్, ఈశ్వరయ్య యాదవ్, వల్లపు శరత్, చంగల్ రాయుడు పాల్గొన్నారు.

జూలై 4న వాహనాలకు వేలం

బ్రి.కొత్తకోట : వివిధ కేసులో పట్టుబడిన 25 వాహనాలకు జూలై 4న ఉదయం 11 గంటలకు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వేలంపాటను నిర్వహిస్తున్నట్లు ఎస్.ఐ.రామ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 21 ద్విచక్ర వాహనాలకు, 4 కారుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలపై ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చునన్నారు. ద్విచక్ర వాహనాలు చూడాల నుకునేవారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి చూడవచ్చుని తెలిపారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీస్

కలకడ : మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మలంషావలికి డిఇఒ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. మంగళవారం కాలం చెల్లిన కోడిగుడ్లు విద్యార్థులకు వడ్డించడంపై డిఇఒ పాఠశాలను తనిఖీ చేశారు. మిడ్ డే మీల్స్ ఎడి నరసింహులు బుధవారం ఆదర్శ పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ పాఠశాలలో తనిఖీలు నిర్వహించి వంట సిబ్బందిని ప్రశ్నించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాఠశాలలో కాలం చెల్లిన కోడి గుడ్లు 300 ఉన్న మాట వాస్తవమేనని వాటిని విద్యార్థులకు వడ్డించలేదని చెప్పారు. ఈనెల 10న పంపిణీ చేసిన గుడ్లను ఉడికించడానికి నీళ్లలో వేస్తే అవి పైకి తేలడంతో ఏజెన్సీకి తరలించినట్లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులను మధ్యాహ్న భోజన నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు మరల పునరావృతం కాకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. డిఇఒ జారీ చేసిన షోకాజ్ నోటీసకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. **మధ్యాహ్నభోజనం తనిఖీ :** మధ్యాహ్న భోజ నాన్ని ఎడి నరసింహులు, ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తనిఖీ చేశారు. విద్యా ర్థులకు వడ్డిస్తున్న భోజనాలు బాగున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ మునిందర్ నాయక్, మిడ్ డే మీల్స్ సెక్షన్ అసిస్టెంట్ సునీల్‌కుమార్, సిఆర్‌పి శ్రీకాంత్, స్కూల్ కమిటీ చైర్మన్ మస్తాన్‌అహ్మద్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ములకలచెరువు : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు..నాయనవారిపల్లికు చెందిన ప్రసాద్, కదిరి చెందిన మహేష్ ద్విచక్రవాహంలో పెద్దపాలెం బ్రిడ్జి మీద వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారికి చికిత్స నిమిత్తం 108 సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎర్రచందనం కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎర్రచందనం కేసులో పరారీలో ఉన్న ఓ నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్.ఐ.రామ్మోహన్ కథనం మేరకు వివరాలు..గత ఏడాది లక్కిరెడ్డిపల్లి మండలం ఎగువపాలెంకు చెందిన పవన్, అతని సోదరుడు కొండలస్వామి అలియాస్ సుదర్శన్(24) అనే వీరిద్దరూ మరి కొంతమందితో కలిసి ఒక క్వాలిస్ వాహనం, రెండు ద్విచక్ర వాహనాల ద్వారా 8 ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా తనిఖీల్లో శంకరాపురం వద్ద పట్టుబడ్డారన్నారు. అప్పట్లో మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేసి ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో సుదర్శన్ పరారీలో ఉన్నాడన్నారు. నిందితుడు కాండ్లమడుగు క్రాసులో ఉన్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి నిందితుడుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.